
### దటీజ్ తెలంగాణ

తెలంగాణ తలసరి ఆదాయం రూ. 3,12,398. మన కంటే వందేండ్ల ముందే రాష్ట్రంగా ఏర్పడి, మూడురెట్లు ఎక్కువ జనాభా ఉన్న బీహార్ పౌరుడి తలసరి ఆదాయం రూ. 54,383 మాత్రమే. బీహార్‌లోని ఆరుగురు సభ్యులున్న ఓ కుటుంబం ఆర్జించే సంపాదనను.. తెలంగాణలో ఒక్క వ్యక్తే సంపాదించగలడు. దేశ సగటు కంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ. 1,40,398 ఎక్కువ.



సంక్షేమం

అంధత్వ రహిత తెలంగాణనే లక్ష్యంగా ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించి, ఉచితంగా అద్దాలందించడం, అవసరమైతే ఆపరేషన్లు నిర్వహించడానికి ప్రభుత్వం కంటివెలుగు పథకాన్ని తీసుకొచ్చింది. రెండు విడుతల్లో దాదాపు 3 కోట్ల మందికి పరీక్షలు చేశారు. ఇది 75శాతం తెలంగాణ జనాభాకు సమానం.


కంటి వెలుగు

పథకం ప్రారంభం **2020**

లబ్ధిదారులు **3 కోట్లు**

### సోషల్ యాంగిల్

## మార్చురీలోకి కాంగ్రెస్..




కొండ నాలుకకు మందేస్తే
ఉన్న నాలుక ఊడిందట..
అట్లుంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి
రాష్ట్రంలో ఐసీయూలో ఉన్న కాంగ్రెస్‌ను
మళ్లీ సాధారణ స్థితికి తీసుకొస్తాడని నమ్మి
రేవంత్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్ పగ్గాలు అప్పగిస్తే
ఆయన ఏకంగా టికెట్లు అమ్మకానికి
తెరలేపి ఐసీయూలో ఉన్న కాంగ్రెస్
పార్టీని నేరుగా మార్చురీలోకి పంపిస్తున్నడు..

-పావనీగౌడ్

## ముచ్చటగా మూడోది..



తెలంగాణలో బీజేపీని ఓడిస్తాం:
రాహుల్ గాంధీ
నువ్వు సూపర్ రాహుల్!
ఇదే ఒరవడి కంటిన్యూ చేసి ఆ పార్టీకి
మూడో స్థానం కన్ఫర్మ్ చేసెయ్..

-దిలీప్ కొణతం


# చీట్ లీడర్స్

## గోబెల్స్‌ను మించి కాంగ్రెస్, బీజేపీ ప్రచారం

అసత్య ప్రచారాలు.. అభూత కల్పనలే వీరి ఎన్నికల కుతంత్రం

### ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు కుటిల యత్నాలు.. సామాజిక మాధ్యమాల్లో అడ్డగోలు రాతలు

అసత్య ప్రచారం, విద్వేషం, రెచ్చగొట్టడమే ఎజెండాగా కాంగ్రెస్, బీజేపీ కుతంత్రాలకు తెరలేపుతున్నాయి. ప్రజాభిమానం, విశ్వసనీయత కలిగిన ఛానళ్లు, వెబ్‌సైట్లు, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ఊహాజనిత కథనాలు, నిరాధార వార్తలు ప్రసారం చేస్తూ విషం చిమ్ముతున్నాయి. ప్రజారంజక పాలనను అందిస్తున్న కేసీఆర్ సర్కార్‌పై ఆయా మాధ్యమాల ద్వారా విషం చిమ్మి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుయుక్తులు పన్నుతున్నాయి.



**ఒకరు** ఉద్వేగపూరిత మాటలతో అమాయక ప్రజలను రెచ్చగొడతారు. విద్వేషాన్ని ఎగజిమ్ముతారు. ఇంకొకరు ప్రత్యర్థి పార్టీలపై ఉన్నవి.. లేనివి కల్పించి సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున అసత్య ప్రచారం చేస్తారు. సంబంధం లేని విషయాలను అంటగడుతూ బద్నాం చేస్తారు. అక్కడితో ఆగరు... తమపై తామే దాడులు చేయించుకుంటారు. ఆపై ప్రత్యర్థి పార్టీలే తమపై అసత్య ప్రచారాలు, దాడులకు దిగాయని పెడబొబ్బలు పెడతారు. ఇలాంటి అనైతిక చర్యలకు ఒడిగట్టడం ద్వారా జనంలో సానుభూతి పొందేందుకు విశ్వప్రయత్నాలూ చేస్తుంటారు. అయితే, ఇవన్నీ ఎంతోకాలం నుంచి ప్రజలు గమనిస్తుండడంతో విశ్వసనీయతను కోల్పోయిన నేపథ్యంలో వికృత చేష్టలకు దిగుతున్నారు.

ఎన్నిక ఏదైనా సరే ఇదీ బీజేపీ అనుసరించే.. అనుసరిస్తున్న వ్యూహం. దుబ్బాక ఉప ఎన్నిక మొదలు హుజూరాబాద్ ఉప ఎన్నిక వరకూ కాషాయ పార్టీ ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతూనే ఉన్నది. ఆ ఎజెండాతోనే ఎన్నికల్లో గెలిచేందుకు అన్నిరకాల కుయుక్తులను పన్నుతున్నది. తామేమీ తక్కువ తినలేదంటూ ఇప్పుడు అదే బాటలో హస్తం పార్టీ సైతం పయనిస్తున్నది. బీజేపీని మించి సోషల్ మీడియా వేదికగా గోబెల్ ప్రచారాలకు దిగుతూ ప్రజలను అయోమయంలో పడేస్తున్నది.


### దుబ్బాక మొదలు హుజూరాబాద్ వరకు..

దుబ్బాక ఉప ఎన్నిక సందర్భంగా బీజేపీ నేతలు అనేక కుట్రలకు తెరలేపారు. ప్రభుత్వంపై ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీపై అడ్డగోలు అసత్య ప్రచారాలను చేశారు. బీజేపీ నేత రఘునందన్‌రావు బంధువు ఇంట్లో పెద్దమొత్తంలో నగదు పట్టుబడినా, అందుకు సంబంధించిన వీడియోలు ఉన్నా కాషాయ మూకలు ఆ వీడియో క్లిప్‌లను ఎడిటింగ్ చేసుకుని ప్రభుత్వం, పోలీసులపై బురదజల్లేందుకు యత్నించారు. చివరకు పోలింగ్ ముందురోజు సాయంత్రం కూడా కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల అనంతరం బీఆర్ఎస్‌లో చేరుతారంటూ ఊరూరా ప్రచారం చేశారు. ఆ తరువాత జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఇటీవల జరిగిన హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇలాంటి వికృత ప్రచారానికి పూనుకున్నారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అసత్య ప్రచారాలు చేసి, వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా ఈసీకి లేఖ రాసి దళితబంధు పథకాన్ని కుట్రపూరితంగా అమలు కాకుండా అడ్డుకోవడమే కాకుండా, కావాలనే బీఆర్ఎస్ సర్కారు ఈ పథకాన్ని నిలిపేసిందనే అబద్ధాన్ని ప్రచారం చేశారు. అయితే, బీజేపీ కుట్రలను గులాబీ నేతలు సాక్ష్యాలు సహా బయటపెట్టడంతో కాషాయ మూక అక్కడితో ఆ విషయాన్ని వదిలిపెట్టింది.

### బీజేపీ బాటలో కాంగ్రెస్..

తమ జమానాలో చేసిన మంచి పనులేమీ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలపై బురద జల్లేందుకు ఒడిగడుతున్నది. ప్రజల్లో విశ్వసనీయతను సంపాదించుకునే ప్రయత్నాలేమీ చేయకుండా బీజేపీ అనుసరిస్తున్న అసత్య ప్రచారాలనే నమ్ముకున్నది. ఎన్నికల వ్యూహకర్తలను అడ్డం పెట్టుకుని, సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థి పార్టీలపై, ముఖ్యంగా బీఆర్ఎస్‌పై అడ్డగోలుగా విషప్రచారాలకు తెరతీసింది. యూట్యూబ్ చానళ్లు, ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఫేక్ ఐడీలను సృష్టించి, తద్వారా నిరాధార, అభూత కల్పనలతో అసత్య ప్రచారాలకు తెగబడుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక మొదలు.. పోటీ పరీక్షలకు సంబంధించి, బీఆర్ఎస్ పథకాలపై కాంగ్రెస్ విషం చిమ్ముతున్నది. పలు సంస్థలకు డబ్బులిచ్చి తమకు అనుకూలంగా సర్వేలు చేయించుకోవడంతో పాటు రిపోర్టులను తెప్పించుకుంటూ, వాటినే ప్రచారం చేయాలని, ప్రచారానికి సైతం డబ్బులు చెల్లిస్తామని ఆఫర్లు ఇస్తున్నదంటే ఆ పార్టీ ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

... బండారు రాజు



'సినిమాల్లో టైమ్‌పాస్ కోసం తెలంగాణ వస్తదా? రాదా? అని కామెడీ సీన్లు చూసే రోజుల నుంచి, కోటి ఎకరాల పంటతో దేశానికి అన్నం పెడుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఎదిగేలా చేసుకున్న ప్రజలకు తెలియదా ఏది వాపో.. ఏది బలుపో? ఎవరు కావాలో.. ఎవరు వద్దో?' - మంత్రి కేటీఆర్

# ఆ గట్టునుంటారా.. ఈ గట్టుకొస్తారా ?

'వచ్చే గవర్నమెంటు మాదే' అని అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారే ప్రగల్భాలు పలుకుతున్నారు. వచ్చిన తర్వాత మేం ఇది చేస్తాం, మేం అది చేస్తాం.. అని లిస్టు చదువుతున్నారు. కాంగ్రెస్ గ్యారంటీలిస్తున్నది. ఎన్నికలు రాగానే ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమైన ఇదే కాంగ్రెస్ పార్టీ అర్ధ శతాబ్దం పాటు ఈ ప్రాంతాన్ని పాలించినప్పుడు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయింది? అధికారంలోకి వచ్చాక ఏమేమో చేస్తాం అని చెబుతున్న ఇదే బీజేపీ, తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇవన్నీ ఎందుకు చేయటం లేదు? తెలంగాణ ప్రజలు గుడ్డివాళ్లు కాదు. ఎవరిని ఎన్నుకోవాలో, ఎందుకు ఎన్నుకోవాలో ప్రజలకు స్పష్టంగా తెలుసు.

తెలంగాణ ఏర్పడ్డాక ముచ్చటగా మూడోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో తిరుగులేని వేగంతో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తున్నది. బీజేపీ-కాంగ్రెస్‌లు ఎన్నెన్నో హామీలతో వల విసురుతున్నాయి. కానీ, ఆ పార్టీల తరపున పోటీ చేయడానికే బలమైన అభ్యర్థులు దొరకనప్పటికీ టికెట్ల అమ్మకానికి మాత్రం దుకాణాలు తెరిచిపెట్టారు.

తెలంగాణ వస్తే కరెంట్ ఉండదు.. పనులు ఉండవు.. హైదరాబాద్‌లోని కంపెనీలన్నీ వెనక్కి వెళ్లిపోతాయి.. నక్సలైట్లు చెలరేగుతారు.. మీకసలు పాలన చేతకాదు వంటి అనేక అపహాస్యాల పునాదులపై కేసీఆర్ కట్టిన పాలరాతి సౌధం మన తెలంగాణ. ఇప్పుడు అరచేతిలో స్వర్గం చూపించే హామీలో, ఊకదంపుడు ఉపన్యాసాలో కాదు. ప్రజలకు ఏం కావాలో.. ఏం ఇవ్వాలో.. ఎలా చేయాలో తెలిసిన నాయకత్వం కావాలి. ఒక కొత్త రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దటంలో అహరహం శ్రమించే నిత్య శ్రామికుడే తెలంగాణకు కావాలి.

అభివృద్ధి ఎలా ఉంటుందో ఇప్పుడు కండ్ల ముందు కనిపిస్తున్నది. సంక్షేమ పథకం అంటే ఏమిటో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అనుభవపూర్వకంగా తెలుసుకున్నది. సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో పని చేస్తూ, ప్రపంచం నలుమూలల నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి రప్పిస్తున్న 'తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ కేటీఆర్'ను ఎలా విస్మరిస్తారు? కేసీఆరే ఆదర్శంగా రాష్ట్రం, రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తలను ఎలా పక్కన పెట్టగలుగుతారు?

అరవై ఏండ్లుగా తెలంగాణ అణచివేతకు కారణమైనవాళ్లు, వారికి వత్తాసు పలికిన వాళ్లు ఆ గట్టునున్నారు. తెలంగాణను సాధించి, దశాబ్దాలుగా వివక్షకు గురైన ప్రజానీకం అభివృద్ధి, సంక్షేమం కోసం అనుక్షణం తపించే గుండె ఈ గట్టున ఉంది. ఏ గట్టున ఉండాలో.. చాయిస్ మనదే.

... చిమ్మని మనోహర్



## మరో ఐకాన్ కేబుల్ బ్రిడ్జి

హైదరాబాద్ షాన్‌కు మరో అద్భుతం తోడైంది. మాదాపూర్ వద్ద దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి పర్యాటకులతో పాటు పట్టణవాసులకు ఫేవరేట్ స్పాట్‌గా మారింది. నగరంలో ఎన్నో సందర్శన స్థలాలున్నా ఇది సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నది. పగలు, రాత్రి సందర్శకులతో కళకళలాడుతున్నది. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ కేబుల్ బ్రిడ్జికి ఫిదా అవుతున్నారు. రాత్రి వేళలో మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో ఈ ప్రాంతం మరో లోకాన్ని తలపిస్తున్నది.

### షహర్ కీ బాత్

## అద్దంలా హైదరాబాద్ రోడ్లు..



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు నగరంలోని రోడ్లతో పాటు రవాణా రంగంలో అనేక ఇబ్బందులు ఉండేవి. ఈ సమస్యలు ఎప్పుడు తీరుతాయా అని నాకు నేనే ప్రశ్నించుకునేవాడిని. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అత్యంత వేగంగా నగర ప్రజల కోసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, రోడ్లు, కాలనీల అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో రోడ్లన్నీ అద్దంలా మెరుస్తున్నాయి. దశాబ్దాలుగా ప్రయాణికులు పడ్డ అవస్థలకు చెక్ పెట్టారు.

రవాణా వ్యవస్థలో సమూల మార్పులు జరిగాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంతో పాదచారుల ప్రాణాలకు ముప్పు తప్పింది. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలతో పాటు గ్రేటర్ పరిధిలో అనేక ప్రధాన జంక్షన్లలో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించారు. దీంతో ట్రాఫిక్ ఎప్పటికప్పుడు క్లియర్ అవుతుండడంతో ప్రయాణం సులువైంది. ఇంతకు ముందు ఎక్కడ ఏ గుంత ఉందోననే భయం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. రోడ్లపై గుంతలున్నాయని సమాచారం వచ్చిన క్షణాల్లోనే వాటిని పూడ్చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. మెజారిటీ, మైనారిటీ అనే తేడా లేకుండా అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నది. ఇలాంటి ప్రభుత్వం మరింత కాలం పనిచేసేలా దీవిస్తే మెరుగైన, నాణ్యమైన సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుంది. మెట్రో రైలు నగరానికి తలమానికంగా ఉన్నది. ప్రజారవాణాలో మెరుగైన సేవలు కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు.

- సర్దార్ జోగిందర్ సింగ్,
గురుద్వారా సాహిబ్ జాయింట్ సెక్రటరీ , అమీర్‌పేట

## ఓటర్ ఐడీ కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 గుర్తింపు కార్డులు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు డాక్యుమెంట్లను చూపించి ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రంలో వారి గుర్తింపు నిర్ధారణకు పంపిణీ చేసిన ఓటరు స్లిప్‌లు చూపిస్తే సరిపోదని, ఓటరు గుర్తింపు కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డులను చూపించాలన్నారు.

**ప్రత్యామ్నాయ కార్డులు ఇవే...**

ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ జాబ్‌కార్డు, పోస్టాఫీస్ లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, దివ్యాంగుల ఐడెంటిటీ కార్డు, ఏదైనా ఒక గుర్తింపు కార్డులను తీసుకొని పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ పేర్కొన్నారు.




# పొలమంతా పారింది.. గోదావరి

- రూ.249 కోట్లతో 13 ఎత్తిపోతల పథకాలు
- కొనసాగుతున్న రూ.143 కోట్ల అభివృద్ధి పనులు
- టెంపుల్ సిటీకి వడివడిగా అడుగులు
- మిషన్ కాకతీయతో మండుటెండల్లో నిండుగా చెరువులు
- ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చొరవతో మారిన ధర్మపురి రూపురేఖలు

జగిత్యాల జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం ధర్మపురి. ఈ క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి కొలువు దీరిన చోటు. పవిత్ర గోదావరి ఉత్తర, దక్షిణాలుగా ప్రవహించే నేల ఇది. 2009లో జరిగిన పునర్విభజనలో ధర్మపురి నియోజకవర్గాన్ని ఏర్పాటుచేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత 2018లో ఎన్నికలు జరిగాయి. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌పై బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఘనవిజయం సాధించారు. నిజానికి కొప్పుల ఈశ్వర్ డబుల్ హ్యాట్రిక్ సాధించారు. ఇప్పుడు ఏడోసారి బరిలోకి దిగుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి కొప్పుల ఈశ్వర్‌కు పట్టం కట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

**ఏరియల్ వ్యూ: ధర్మపురి**



సీఎం కేసీఆర్ సారథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులతో ధర్మపురి నియోజకవర్గ రూపురేఖలు మారాయి. మంత్రి ఈశ్వర్ అత్యధికంగా నిధులు తెచ్చి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి ఈ టర్మ్‌లోనే దాదాపు రూ.2000 కోట్లు మంజూరు చేయించారు. మండల కేంద్రాల నుంచి ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు, గ్రామాల్లో అంతర్గతంగా సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మింపజేశారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలం అందుతున్నది. మిషన్ కాకతీయ ద్వారా నియోజకవర్గంలో దాదాపుగా చెరువులన్నింటినీ పునరుద్ధరించారు. రూ. 249 కోట్లు వెచ్చించి గోదావరిపై 13 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. రూ.135 కోట్ల వ్యయంతో పూర్తయిన రోళ్లవాగు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో దాదాపు 10వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. దీనికి తోడు వరద కాల్వల నుంచి ఎస్సారెస్పీ కాల్వకు లింక్ కెనాల్ తవ్వడంతో పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతున్నది.

మేజర్ పంచాయతీగా ఉన్న ధర్మపురిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించారు.వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 40 కోట్లు మంజూరు చేయించారు. ధర్మపురిని రూ.140 కోట్లతో టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తున్నారు. రూ.4కోట్లతో ధర్మపురిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించారు. రూ.6 కోట్లతో పట్టణం పరిధిలోని హైవేని నాలుగులైన్ల రహదారిగా విస్తరించారు. కూడళ్లన్నింటినీ సుందరీకరించారు.



ఈ సీజన్‌లో రైతు బంధు కింద దాదాపు 1.02లక్షల మంది రైతులకు రూ.72కోట్లు ఖాతాల్లో జమయ్యాయి. నియోజకవర్గంలో 400 మంది బీసీలకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున అందజేశారు.

మిషన్ కాకతీయ ద్వారా నియోజకవర్గంలో రూ. 45 కోట్లతో 160 చెరువులను ఆధునీకరించారు. ఒకప్పుడు సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు పడ్డ గ్రామాల్లో చెరువులు పునరుద్ధరించడం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లోకి కూడా పుష్కలంగా నీరు చేరింది. దాదాపు ఒకటిన్నర టీఎంసీల నీరు సేద్యానికి అందుబాటులోకి వచ్చింది.

– ధర్మపురి, నమస్తే తెలంగాణ